


# తోలుబొమ్మ

**సింహప్రసాద్**

**ఆటుపోట్లనీ ఆంక్షల్నీ ఎదుర్కొని అచ్చమైన పరిపాలన అందించడానికి స్వపక్షపు స్వార్థం మీద గెలిచిన ఓ మహిళ కథ**

"సత్యా!"

"అవును. సత్యనే మాట్లాడుతున్నాను. సత్యాన్నే మాట్లాడుతున్నాను. రాజకీయాలంటే కాంట్రాక్టర్లతో కుమ్మక్కై అధికారుల్ని ఆకట్టుకొని ప్రజల సొమ్ముని నిలువునా దోచెయ్యటం కాదు...."

"అబ్బో! నిన్నగాక మొన్న రాజకీయాల్లో కళ్ళు తెరిచిన పిల్లకాకివి! మా డాడీ పలుకుబడితో మేం విరజిమ్మిన డబ్బుతో ఎన్నికైన మున్సిపల్ ఛైర్‌పర్సనవ్‌వి! అప్పుడే స్వంతగొంతుతో మాట్లాడేదాకా వచ్చావన్న మాట"

"మీ పలుకే పలకడానికి నేనేం చిలుకని కాదు..."

"ఇంకతగ్గు. ఊరికే రెచ్చిపోకు. నువ్వు నా భార్యవనీ నేనాడమన్నట్లల్లా ఆడాల్సిన ఆటబొమ్మవనీ మరిచిపోకు. నేను గీచిన గీటు దాటాలని చూశావో మర్యాద దక్కదు" విసురుగా వెళ్ళిపోయాడు రాజశేఖరం.

కన్నీళ్ళు పొంగివచ్చాయి సత్యకి. గదిలోకెళ్ళి బావురుమని ఏడ్వాలనిపించింది. కాని నిగ్రహించుకుంది. నిస్త్రాణగా సోఫాలో కూలబడింది.

మూడునెలలక్రితం వరకూ ఆమె కేవలం ఇల్లాలు మాత్రమే. పట్టుచీర కట్టుకుని నగలు ధరించి పూలుపెట్టుకుని పెళ్ళిళ్ళకీ పేరంటాళ్ళకీ వెళ్ళటమే పనిగా మసిలేది. మాజీ ఎమ్మెల్యే చంచల్రావుగారి కోడలిగా కాంట్రాక్టర్ రాజశేఖరం గారి భార్యగా మాత్రమే గుర్తింపబడేది. అందులోనే ఏదో తృప్తి మరేదో ఆనందమూ వున్నట్టు భ్రమపడుతూవుండేది.

కాని ఒకానొక పెళ్ళిలో కాలేజీ స్నేహితురాలు రాధిక కన్పించి "నువ్వు నువ్వేనా సత్యా? విద్యార్థినుల చేత ఉద్యమాలు చేయించిన ఒకనాటి స్టూడెంట్‌లీడర్‌వేనా నువ్వు?"అని ప్రశ్నించేసరికి తెల్లబోయింది.

"ఆనాటి చైతన్యం ఏదో సాధించాలన్న అప్పటి తపన ఆరాటం అవన్నీ ఏమయ్యాయే?"అని అడిగేసరికి కలవరపడింది.

"పెళ్లైనంతమాత్రాన ఆడది తన భావాలని సమాధిచేసి నాలుగ్గోడల మధ్య బందీగా వుండిపోవాలా?"అని నిలదీసేసరికి ఆలోచనలోపడింది.

"విద్యవిజ్ఞానం సేవాభిలాష నాయకత్వ ప్రతిభ-అన్నీ వున్న నీలాటివారు రాజకీయాల్లో ప్రవేశించి రాజకీయాలకి కొత్తభాష్యం చెప్పాలి సత్యా" అని చెప్పేసరికి తేలిగ్గా నవ్వేసింది.

కాని రాధిక మాటలు ఒకనాటి తన ఆలోచనలు సత్యని వెంటాడటం మానలేదు. మనస్సుని మధించడమూ మానలేదు.

ఇంతలో మున్సిపల్ ఎన్నికలొచ్చాయి. మున్సిపల్ ఛైర్‌పర్సన్ పదవి స్త్రీలకి రిజర్వ్‌చేయడంతో సత్యచేత పోటీచేయించారు భర్తామావగారూనూ. అనుకోకుండా కలిసివచ్చిన అవకాశానికి పొంగిపోయింది. తనేమిటో రుజువు చేసుకోవాలని పట్టణాభివృద్ధికి ఎన్నెన్నో చెయ్యాలని పథకాలు వేసుకుంది. ఆ వివరాలు చెప్పి జనాన్ని ఆకర్షించింది. జనానికి ఆమెలో ఓ కొత్త నాయకురాలు కన్పించగా బ్రహ్మరథం పట్టారు. అత్యధిక మెజార్టీతో గెలిపించారు.

కాని ఆ తర్వాత ఆమెని నిర్వాంతపరుస్తూ రంగం మీదికొచ్చాడామె భర్త రాజశేఖరం. ఆమె పేరుమీద అతడు పెత్తనం చలాయించాలని చూశాడు. కాంట్రాక్టర్లతో మున్సిపల్ అధికారులతో చేతులు కలిపి అవినీతికి నిలువెత్తు నిదర్శనమయ్యాడు.

అది తెలిసి అతడ్ని నిలదీసింది. "నిన్ను గెలిపించడానికి పెట్టిన పెట్టుబడినంతా రాబట్టుకోవద్దూ"అని నవ్వేశాడు.

"ప్రజలకి స్వచ్ఛమైన పాలనని ఇవ్వాలనుకున్నాను. అందుకు భిన్నంగా జరిగితే సహించను"అందామె సహ

నం నశించి.

దాంతో నువ్వు నాభార్యవన్న సంగతి మరిచిపోవద్దని చెప్పి ఒకరకంగా హెచ్చరించివెళ్ళేడు!

నిట్టూర్చింది సత్య.

అవాళంతా ముభావంగానే వుంది. రాజశేఖరం ఆమెని మాటల్లో పడేయాలని చూశాడు గాని ఆమె లొంగలేదు.

"పదవిని ఎంజాయ్ చెయ్యడం నేర్చుకోవోయ్" అంటూ నవ్వేడు. ఆమె శృతి కలపలేదు. కాంట్రాక్టు పనులకి సంబంధించిన కొన్ని పేపర్లు తెచ్చిచ్చాడు. వాటివంక కన్నెత్తి చూడలేదామె.

అతడెళ్ళి తండ్రికి చెప్పినట్టున్నాడు మావగారు పిలిచారు సత్యని. హాల్లోకెళ్ళికూర్చుంది. ఆమెనీ ఆమె కళ్ళనీ ముఖాన్నీ చూశారు చంచలరావు. ఆమె మనఃస్థితిని అంచనా వేశారు. మెల్లగా గొంతువిప్పారు.

"అబ్బాయి అంతా చెప్పేడు. నీలో జనాన్ని ఆకట్టుకోగల గొప్ప ఆకర్షణశక్తి వుంది. జాగ్రత్తగా మలచుకుంటే గొప్పలీడర్‌వి అవుతావు. పదవిచేబట్టిన కొత్తలో ఏదేదో చేసెయ్యాలనీ అందరి ప్రశంసలూ పొందెయ్యాలనీ చాలా ఆరాటంగా వుంటుంది. ఆవేశంగానూ వుంటుంది. కాని పనులన్నీ తనొక్కరి వల్లా కావని అందుకెందరి తోడ్పాటో అవసరమనీ గ్రహించడానికి కొంతటైము పడుతుంది. వాస్తవస్థితి అర్థమయ్యేసరికి విరక్తి పుడుతుంది. మనం నిమిత్తమాత్రులం అనిపిస్తుంది. అప్పుడైనా నలుగుర్తో నారాయణ అంటే ఫర్లేదు. ఎదిరిస్తే అంతా ఏకమై కాళ్ళక్రింది తివాసీ లాగేస్తారు. అందుకనే రాజకీయాల్లో జనాన్నీ పై నాయకుల్నే కాదు మనతో వున్న మనతో వున్న వాళ్ళనీ మనవాళ్ళనీ ఆకట్టుకొంటూ అందరి ఆశలు తీరుస్తూ నొప్పించక తానొవ్వక ముందుకి దూసుకుపోవాలి"

"అందుకే మీరు మాజీ యమ్మెల్యేగా మిగిలిపోయారు"అని మనస్సులో అనుకుని అంది "జనానికెన్నో చేస్తామని చెప్పి పదవిలో కొచ్చి పచ్చిస్వార్థంతో..."

ఆమె మాటలు పూర్తికాకుండానే పెద్దగా నవ్వేశారాయన.

"అందుకే ఆడవాళ్ళకి పరిపాలించడం చాతకాదంటాను. మీకు ఆవేశం ఎక్కువ. ఆలోచన తక్కువ. జనం గొర్రెలమంద. వాళ్ళగురించి మళ్ళీ ఎన్నికల ముందాలోచించొచ్చులేగాని ముందు అబ్బాయికేం అడ్డురాకు. చెడ్డపేరొస్తే వాడికే వస్తుందిలే. నిన్నంతా మిస్సెస్ క్లీన్ అనుకుంటారు. అది చాలు మళ్ళీ ఎన్నికవడానికి"

ఆమె మోము ఎర్రబడింది. ఎన్నో ప్రశ్నించాలనుకుంది. కానేమీ అడగలేక లేచింది. అడిగినా ప్రయోజనం వుండదని తెలుసు.

"ఇంకో సంగతి. నువ్వు ఇల్లాలివి. ఇంటిని వదిలేసి రోజూ మున్సిపల్ ఆఫీసుకెళ్ళి రాచకార్యాలేం చక్కబెట్టక్కర్లేదు. కౌన్సిల్ మీటింగులకెళ్తే చాలు. మిగతావి అబ్బాయి చూసుకుంటాడు."

చెళ్ళున కొరడాతో కొట్టినట్టు అదిరిపడింది సత్య. రోషంగా చూసింది.

తను చెయిర్‌పర్సన్ కావచ్చు. చేతిలో అధికారం వుండొచ్చు. కాని తనాయన కోడలు. అంచేత ఎన్నైనా అంటారు! అధికారం చెలాయిస్తారు!

విసురుగా లోపలికెళ్ళిపోయింది.

రోజులు మెల్లగా దొర్లుతున్నాయి.

**నీలో జనాన్ని ఆకట్టుకోగల గొప్ప ఆకర్షణశక్తి వుంది. జాగ్రత్తగా మలచుకుంటే గొప్పలీడర్‌వి అవుతావు. పదవిచేబట్టిన కొత్తలో ఏదేదో చేసెయ్యాలనీ అందరి ప్రశంసలూ పొందెయ్యాలనీ చాలా ఆరాటంగా వుంటుంది.**



ఆమె ప్రమేయం లేకుండానే అన్నీ జరిగిపోతున్నాయి. అధికారులంతా రాజశేఖరం ఆజ్ఞల్ని స్వీకరిస్తున్నారు. కాంట్రాక్టర్లు అతగాడ్ని మహరాజులా చూస్తున్నారు.

పట్టణపరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడనే వున్నట్టుంది!

సత్యకెంతో అనీజీగా వుంది. కళ్ళనీళ్ళ పర్యంతంగా వుంది.

ఏంచెయ్యాలో భర్త వైఖరినెలా మార్చాలో తన బాధ్యతల్నెలా నెరవేర్చాలో తోచక తల్లడిల్లుతోంది!

కాస్త మార్పుగా వుంటుందన్చెప్పి పుట్టింటికెళ్ళింది సత్య.

తండ్రి దగ్గర తనగోడంతా వెళ్లగక్కింది.

"నువ్వు అతిగా ఆలోచిస్తున్నావమ్మా. అందుకే రాజకీయాలు ఢక్కామొక్కీలు తినగల మగాళ్ళకి చెల్లుతాయి గాని సున్నితమైన ఆడవాళ్ళక్కాదు. ఆడవాళ్ళు పాలించలేరు."

"మీరు మరీనూ. ఎందరు ఆడవాళ్ళు మంత్రులుగా ఆఫీసర్లుగా పనిచెయ్యడం లేదు?"అంది తల్లి ఆ వెంటనే.

"వాళ్ళకి అండగా తండ్రో భర్తో కొడుకో వుండే వుంటారు. ఆడవారి వెలుగు చంద్రకాంతిలాంటిదే"

"నేనొప్పుకోను. మహామహానాయకుల్ని మట్టి గరిపించలేదూ ఇందిరమ్మ? బంగ్లాదేశ్ గొడవల్లో అపరకాళి అన్పించుకోలేదూ?"

"నెహ్రూగారి కూతురు గనుక ఆ స్థాయికెదిగింది. అలాటివాళ్ళు కోటికొక్కరుంటారేమో. అంతే"

"మన సత్యకూడా అలా ఎందుక్కాకూడదు?"

ఉలిక్కిపడ్డారాయన. "నువ్వెక్కడిదానివే. పదవికోసం కాపురాన్ని కాలదన్నమనేట్టున్నావే!"

"అలా ఎందుకనుకోవాలి?"

"చాలు చాల్లే. వాళ్లేదో ముచ్చటగా పదవి కట్టబెట్టారు. వాళ్ళ ముచ్చట తీర్చి మర్యాదగా బయపడితే చాలు. పదవులు శాశ్వతం కాదుకాని ఆడదానికి కాపురం శాశ్వతం"

"మీది మరీ చిత్రం. లోకంలో ఆడవాళ్ళెవరూ పదవులు ఏలటం లేదూ అధికారాలు చెలాయించడం లేదూ అన్నట్టు మాట్లాడతారేవిటి. వాళ్ళందరి సంసారాలూ సజావుగా సాగటం లేదూ? ఎందరో ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తున్నారు. వారి వారి మగాళ్ళు వారిని ఉద్యోగ ధర్మం నిర్వర్తించనివ్వకుండా అడ్డుపడుతున్నారా?"

"భేష్ మమ్మీ. అక్కలాగా మమ్మీ కూడా ఉపన్యాసాలు దంచేస్తోంది"అన్నాడు సత్య తమ్ముడు తప్పట్లు కొట్టి మరీ.

"ప్రజలు నువ్వేదో చేస్తావని ఎన్నుకున్నారు. వారి ఆశల్ని తీర్చడం నీ ధర్మం. నీ బాధ్యత. అందుకు కుటుంబసంబంధాలు అడ్డురాకుండా చూసుకోవాలి. అలా చూసుకోలేనప్పుడు పదవిని వదులుకుని ఇంటికే పరిమితమైపోవాలి. అంతే తప్ప జనాన్ని మోసం చెయ్యడం మంచిది కాదు"అంది సత్య చెల్లెలు సత్యతో.

తమ్ముడామె మాటల్ని బలపరిచాడు.

"మీ హితబోధ బావుంది. మోసేవాడికే తెలుస్తుంది కాడిబరువు. రాజకీయాల్లోని ఎత్తులూ ఒత్తిళ్ళూ చందాలూ సంబంధాలూ అందులో వున్న వాళ్ళకి తెలుస్తాయి గాని ఒడ్డునున్న వారికేం తెలుస్తాయి? నా మాటవిని అల్లుడుగారు చెప్పినట్టు నడచుకో సత్యా. ఊరికే ఉద్రేకపడి లేనిపోని లంపటాలు కొనితెచ్చుకోవద్దు"అని ముగించిలేచాడు తండ్రి.

సత్యబదులివ్వలేదు.

ఆమెలో ఓ ఆలోచన రూపుదిద్దుకుంది.

కౌన్సిల్ సమావేశపు ఎజెండాతో వచ్చాడు కమిషనర్. కొన్ని ప్రజాహిత కార్యక్రమాలు చేర్చమంది సత్య. నీళ్ళు నమిలాడతను.

"నేను చెప్పినట్టుచెయ్యండి"అంది గట్టిగా.

పంపునీటిని శుద్ధిచేసి సరఫరా చేయుట. పట్టణ శివార్లలోని కాలనీల్లో పబ్లిక్‌కొళాయిల ఏర్పాటు. పిల్లల పార్కు అభివృద్ధి. పొరుగూళ్ళ నుంచొచ్చే మహిళల కోసం బజారు సమీపాన మరుగుదొడ్ల నిర్మాణం - వగైరాలున్నాయామె సూచించిన కార్యక్రమాల్లో.

ఆమె ఆశించినట్టే మరోగంటలో వచ్చాడు రాజశేఖరం. "ఏవిటేవో చెత్తకార్యాలు చేబడతానన్నావుట"అనడిగాడు గద్దింపుగా.

"అవును. చైర్‌పర్సన్‌గా అది నా కనీస కర్తవ్యం"

"ఏడ్చినట్టేవుంది నీ తెలివి! ఊరికే మున్సిపాలిటీ డబ్బు తగలెయ్యకు. ఆ డబ్బుతో బజార్లో షాపింగ్ కాంప్లెక్స్ కడదాం. మనకి బోలెడు లాభం"

"ఎలా?"

"రెట్టింపుకి ఎస్టిమేట్లు వేయిస్తాం. మనవాడి టెండరు ఖరారు చేయిస్తాం. సగానికి సగం మిగులు"

ఎంత దారుణం! ఎంత దోపిడీ!

కాలేజీరోజుల్లో కమిటీవారూ ప్రిన్సిపాలూ కొన్నిఫండ్స్ తినేస్తున్నారని ఎంత రగడచేసింది.

అలాటిదిప్పుడు....ఆ స్పిరిట్ ఆ ధైర్యం ఏమైపోయాయి?!

కుటుంబసంబంధం నీరు కార్చేసిందా?!

"సారీ. నేనొప్పుకోను"

"వచ్చినట్టు ఒప్పుకుని తీరాలి"

"ఒప్పుకోను"

"అదీ చూస్తాను"

"రేపటి పేపర్లో చూడండి"

"నా గురించి రాయిస్తావా? జనం నమ్ముతారనే?"

"చూద్దాం"

మున్సిపల్ చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు అన్ని పత్రికలకీ ఫోన్ చేసి చెప్పింది సత్య. కారణాలేమిటని తరచి అడిగినా చెప్పలేదామె.

పేపర్లోని వార్త చూసి అదిరిపడ్డాడు రాజశేఖరం. ఆమె ఇంతకి తెగిస్తుందనుకోలేదు. హైదరాబాదులో వున్న చంచ్రావు "తొందరపడొద్దు. వచ్చేస్తున్నా"అంటూ ఫోన్ చేశారు.

కాంట్రాక్టర్లూ కమిషనరూ ఇతర ఉద్యోగులూ పరుగెత్తుకొచ్చారు. మధ్యలో మమ్మల్ని ముంచేస్తే ఎలా అని రాజశేఖరం దగ్గర గోలపెట్టారు. ప్రతిపక్షాలవారు చంకలు కొట్టుకున్నారు. జనం అయోమయంగా చూశారు.

"ఇలాటి పిచ్చిపన్లు చెయ్యకు"అన్నాడు రాజశేఖరం.

"రెంటికీ న్యాయం చెయ్యలేకపోతున్నాను. అందుకే ఇల్లాలిగానే మిగిలిపోదామనుకుంటున్నాను"ధృఢ స్వరంతో అంది సత్య.

"ఇప్పుడు నీ కొచ్చిన కష్టమేమిటసలు? పట్టుచీర కట్టుకుని సభలకీ సమావేశాలకీ వెళ్తూ హాయిగా వుండక పుస్తకాల కబుర్లు పట్టుకుని వూరేగుతావెందుకు?"

"జనం ఎన్నుకున్న నాయకురాల్ని గనుక"

"నువ్వు రిజైన్ చేస్తే మళ్ళీ మన పార్టీ కేండిడేట్ గెలవరు తెలుసా?"

"అవినీతి ఆరోపణలు ఎదుర్కోవడమే తప్ప అభివృద్ధి పనులేం చెయ్యనప్పుడు ఎలా గెలిపిస్తారు?"

"అంటే మన అధికారం మన పరువూ రాబడీ అన్నీ పోయినా సరే రిజైన్ చేసేస్తానంటావ్"

"తోలుబొమ్మని కాదు కదా. అందుకే అలాటి నిర్ణయం తీసుకోవాల్సివచ్చింది"

"అబ్బో రక్తమాంసాలున్న బొమ్మ బయల్దేరిందండీ. మగడిమాట ఖాతరు చెయ్యదు గాని ఊరిని ఉద్ధరిస్తుందిట!" అరిచినట్టుగా అన్నాడు.

"మీరెన్ని చెప్పినా తిట్టినా సరే నా నిర్ణయం మారదు. నా కిష్టం లేని పాత్ర నేను ధరించలేను. దట్సాల్"

బిత్తరపోయాడు రాజశేఖరం.

"మాకాలంలో మొగుడికి ఎదురు చెప్పి ఎరగం. మాయదారికాలం మాయదారి బుద్ధులూనూ!" అంది చేతులు తిప్పుతూ అత్తగారు.

"కాలం ఎప్పుడో మారిందత్తయ్యా. మారాల్సింది కొందరు మనుషులే"

అవాక్కయ్యిందామె.

సత్య రాజీనామాకి కారణమేమిటో బోధపడక రకరకాల ఊహాగానాలు ఊపిరిపోసుకున్నాయి. భర్త,మావగార్ల అవినీతి పనులకి తలొగ్గలేక రాజీనామా చేస్తోందన్న ఊహ బలం పుంజుకుంది. జనంలో సత్య మీద గౌరవాభిమానాలు పెరిగాయి.

ఎందరో గుంపులు గుంపులుగా తరలివచ్చారు. రాజీనామా చెయ్యొద్దంటూ చేతులు పట్టుకుని అర్థించారు. ఆమె మీద కొండంత ఆశపెట్టుకున్నామన్నారు. ఇంటిని చక్కదిద్దే ఇల్లాలే ఇలనీ చక్కదిద్దగలదన్నారు.

అంతా అన్నీ మౌనంగా వింటూండిపోయింది సత్య.

చంచ్రావొచ్చారు. పరిస్థితి గబగబా అంచనా వేశారు. రాజకీయంగా సత్య ఉచ్ఛదశలో వుంది. ఆమెకి ఇంకా పేరొస్తే ఆ పేరుతో తను మళ్ళీ యమ్మెల్యే కావచ్చనుకున్నారు. ఇప్పుడామె పదవి వదిలేస్తే తమ చేతుల్లో ఎలాటి అధికారమూ వుండదు. మళ్ళీ ఎన్నికలనాటికి ఎవరెవరో ఎవరికి తెలుసు?!

"నా ఆటలింకసాగవా?"అని గింజుకుంటున్న కొడుక్కి నచ్చ చెప్పేక కోడలితో అన్నారు-

"నువ్వు రాజీనామా చెయ్యక్కర్లేదు సత్యా. ఇక నేను గాని అబ్బాయిగాని నీ దారికి అడ్డురాము. నీకేది మంచి అన్పిస్తే అది చెయ్యి. ఎలా మంచిదన్పిస్తే అలా పాలించు. నువ్వేమిటో నీ సత్తా ఏమిటో రుజువు చేసుకో"

మహదానందపడింది సత్య.

ఒకనాటి ఉత్తేజం మళ్ళీ వచ్చి చేరగా హుందాగా ధీమాగా స్వేచ్ఛగా మున్సిపల్ ఆఫీసుకి బయల్దేరింది.

ఇప్పుడే కొత్తగా గెలిచి వస్తున్నట్టు ఎంతో సంబరంగా వుంది. అవును మరి. ఇప్పుడు గెలిచింది ప్రతిపక్షపు అభ్యర్థి మీదకాదు స్వపక్షపు స్వార్థం మీద!

సత్యపాలనకి శ్రీకారం చుట్టింది సత్య.

# సైతాన్ బైబిల్...అమెరికా వింత!

అమెరికాలో అనేక వింతలు బయటపడుతుంటాయి. అందులో సైతాన్ బైబిల్ ఒకటి. దీని రచయిత ఆంతన్ జండర్ లవె (Anton szandor) 1969లో వెలువడిన యీ పుస్తకం లక్షల్లో అమ్ముడయింది. ఇంకా కొంటూనే వున్నారు.

ఒక చెంపన కొడితే, వెంటనే కొట్టినవాడి గూబ వగలగొట్టు అని యీ సైతాన్ బైబిల్ రాసింది. శత్రువును హృదయపూర్వకంగా ద్వేషించు అని కూడా వుంది. నాకు నేనే రక్షకుడిని. స్వర్గనరకాలు లేవు అని స్పష్టంగా చెప్పింది.

సైతాన్ బైబిల్ రాసిన ఆంతన్ జండర్ లవె ఒక మతసంస్థ స్థాపించి, సైతాన్ గుడిలో ప్రార్థనలు, పెళ్ళిళ్ళు, పేర్లు పెట్టడం వంటి క్రతువులు చేయించాడు.

సైతాన్ గుడి కట్టకముందు లవె రకరకాల పనులు చేసేవాడు. ఫోటోగ్రాఫర్‌గా పిచ్చి కుదిర్చేవాడుగా వుండేవాడు. కొన్నాళ్ళు సర్కస్‌లో సింహాలకు ట్రెయినింగ్ ఇచ్చే పని చేశాడు.

1960 తరువాత లవె ఉపన్యాసాలు చేస్తుండేవాడు. అతడు చేసిన ప్రసంగాలన్నీ నరభక్షణ, దయ్యాలు మొదలైన అంశాలపైనే.

స్థానిక పత్రికలవారు లవె చర్యలకు బాగా ప్రచారం యిచ్చారు. అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కో ప్రాంతంలో అతడి పేరు మోగిపోయింది.

సైతాన్ గుడిలో తన కుమార్తె జోనకు ఉపనయనం వంటిది చేయించాడు.

ఇంకో విశేషమేమంటే లవె ఒక సింహాన్ని పెంచాడు. 700పౌండ్ల బరువుగల సింహం గురించి స్థానిక పత్రికలు ఎప్పుడూ వింత కథలు వేస్తుండేవి.

సైతాన్ గుడి నిత్యానందసాధనే ఆశయంగా పెట్టుకున్నది. పీఠంపై తరచు నగ్న సుందరులు వుండేవారు. సారాయిగ్లాసు పట్టుకొని పీఠాధిపతి లవె బోధనలు చేసేవాడు. "అన్ని మతాలు అనేక నిషేధాలు, నియమాలు విధించాయి. మానవుల అవసరాల దృష్ట్యా మతం పుట్టలేదు. మతాలన్నీ భయం నుండే జనించాయి" అన్నాడు.

సైతాన్ బైబిల్‌ను (Satanic Bible) మాస్కోలోని నాస్తిక మ్యూజియంలో ప్రముఖంగా ప్రదర్శించారు. సైతాన్ క్రతువులు అనే గ్రంథం కూడా లవె రాశాడు.

సైతాన్ దృశ్యాలకోసం సినీ నిర్మాతలు లవెను సంప్రదిస్తూ అతడి సహకారం స్వీకరించారు. దానికి తగ్గట్లే, లవె దగ్గర కార్లు, ఓడలు, వుండేవి. ఇటలీలో అతడికి విలాసవంతమైన ఎస్టేట్లు వున్నాయి. వాటిని సినీ దృశ్యాలకు అద్దెకు యిచ్చేవాడు.

హాలివుడ్ తారలు సైతం సైతాన్ గుడిలో అర్చకులుగా తరచు పనిచేయడంతో దీనికి ప్రచారం లభించింది. అలా చేసినవారిలో 'జేన్స్ మేన్స్ ఫీల్డ్ వున్నది (Jayne mansfield)

అమెరికాలో కొన్ని చోట్ల సైతాన్ గుడులు, కేంద్రాలు వెలశాయి. కాని వాటిని సమావేశ మందిరాలుగా వాడుకుంటున్నారేగాని, సైతాన్ సూత్రాలకు అనుగుణంగా నడుచుకోవడం లేదని లవె ఆగ్రహించి, వాటిని మూసేశాడు.

సైతాన్ గుడి వంటిదే మరి కొందరు ప్రారంభించి, సెత్ గుడి అని పేరుపెట్టారు.

లవె అండర్‌గ్రౌండ్‌కు వెళ్ళిపోయి మళ్ళీ 1990లో బయటకు వచ్చాడు. రాత్రిళ్ళు చర్చలు పెట్టేవాడు. మేరిలిన్ మాన్సన్‌ను 1994లో సైతాన్ గుడి పురోహితుడుగా నియమించాడు.

లవెను బ్లాక్‌పోప్ అనేవారు. 1997 అక్టోబరు 29న ఆంతన్ లవె అస్తమించాడు. అప్పటి నుండీ అతడి ఆస్తికోసం, మొదటి భార్య కుమార్తె కార్ల కోర్టులో కేసు పెట్టింది. లవె యిష్టసఖి బార్టన్ కూడా ఆ ఆస్తి తనకు దక్కాలంటున్నది.

లవె తన గతాన్ని గురించి అన్నీ అబద్దాలు అల్లాడని యిప్పుడు ఆయన అనుచరులు అంటున్నారు. సైతాన్ గుడిపై అమెరికాలో క్రైస్తవులు ధ్వజమెత్తారు.

వియత్నాం యుద్ధంలో పనిచేసిన మైకల్ ఎక్వినో అనే అతడ్ని వారసుడుగా లవె తన గుడికి నియమించాడు. కాని లవె చర్యలలో వైవిధ్యాలు చూచిన మైకల్ అక్వినో వేరుపడిపోయాడు. మరోపక్క విడాకుల కేసులో లవె తన ఆస్తిని కోల్పోగా, చివరకు చూస్తే 60వేల డాలర్లు వున్నది. దీనికోసం కుమార్తె, మాజీ ప్రేమికురాలు కోర్టుకెక్కారు.

సైతాన్ బైబిల్‌కు బలం గలవాడిదే రాజ్యం అనే పుస్తకం ఆధారం అని బయటపడింది. 1896లో మైట్‌యీజ్ రైట్ అనే పుస్తకం వెలువడింది. ఇది ఎవరు రాశారో తెలియదు. ఎలిస్టర్ క్రోలీ (Aleister crowley) ఆయనే రాండ్ రచనల నుండి కూడా లవె కొంత స్వీకరించి సైతాన్ బైబిల్ తయారుచేశాడు.

క్రమేణా సైతాన్ గుడి దిగజారిపోయింది.

-ఎన్. ఇన్నయ్య